9

# డాక్టర్స్ డైలెమా

మద్రాసు
4-5-56

—డియర్ రామకృష్ణా !

నువ్వు వ్రాసిన రెండు ఉత్తరాలూ నాకు అందాయి. చాలా అప్యాయంగా చదివాను. అంతకన్నా ప్రాణ ప్రదంగా వాటిని దాచుకొన్నాను. రాసిన ఉత్తరాలకు జవాబివ్వననీ, ఉత్త సోమరి పోతుననీ, దగ్గర ఉన్నంతసేపే గాని, దూరం వెడితే, అందరినీ మరిచి పోతాననీ నామీద నెపం వేశావు. ఒక రకంగా ఇది నెపం గూడా కాదేమో నీవన్న దాంట్లో కొంతకు కొంత నిజం లేకపోలేదు.

నీకు జవాబు రాయనంత మాత్రాన, నన్నీ విధంగా భావించడం భావ్యంగాదనే నేను మనవి చేసుకొంటున్నాను. స్వల్ప కారణాలను పురస్కరించుకొని, వ్యక్తుల గుణగణాలను, విలువలను నిర్ణయించడం సత్యం కాబోదు. 'ఏమీబా' జీవ కణం నుండి, నేటి వరకూ జీవ చరిత్రలో జరిగిన బ్రహ్మాండమైన పరిణామంలో 'మానవుడు' అగ్ర శ్రేణిలో నిలబడిన

మాట నిజమేనని, నేను ఒప్పు కుంటున్నాను. కానీ, లక్షలాది సంవత్సరాలు, జీవి పొందుతూ వచ్చిన పరిణామ దశల తాలూకు ప్రభావం, మానవునిలో ప్రస్ఫుటిస్తూనే ఉన్నది. వివిధ కాలాలలో, వివిధ దశలలోని 'జీవి' గుణగణాలు, ప్రతి వానిలోనూ, ఎంతో కొంత ఉండక తప్పనిసరి అవుతున్నది. ఈ కారణంగానే, ప్రతి వ్యక్తిలోను ఏదో ఒక లోపం (కనీసం) విధిగా ఉండి తీరుతున్నది.

అలాగని, నేను ప్రతి అత్యాచారాన్నీ, ప్రతి అన్యాయ కార్యాన్నీ సమర్థించ బోవడం లేదు. రామకృష్ణా! నాసంగతి నీకు తెలుసు. దాదాపు ఇరవై సంవత్సరాలు ఒకే చోట కలిసి ఉన్నాము. మనలో మనం ఒకరినుండి మరొకరం దాచు కొన్న దేమీ లేదు. అలాంటి దేదైనా జరిగి ఉంటే; ఇద్దరం కలసి, ఇతరుల వద్ద మనం దాచుకున్నామే గానీ, మనలో మాత్రం ఆ భేదాభిప్రాయం లేదన్న నమ్మకం ఇప్పటికీ నాకు ఉన్నది.

నీ వుత్తరాలు నన్ను చాలా బాధ పెట్టాయి. ఆప్త మిత్రుడువైన నువ్వు, నన్నిలా 'అపార్థం' చేసుకుంటే, నన్నిక సరిగ్గా అర్థం చేసుకోగల వారెవ్వరు? అలాగే, నేను జవాబు రాయక పోవడం వల్ల, నువ్వెంత బాధపడి వుంటావో నేను ఊహించగలను. నేను రాసిన ఉత్తరాలకు, చప్పున జవాబివ్వని వారిపట్ల, నాకూ ఇలాంటి అలసభావమే కలుగుతుంది. అందు చేతనే, నీవేదనను నేను సమగ్రంగా ఆకళింపు చేసుకో గలుగు

తున్నా నేమో చెప్పలేను.

రాత్రి పదిగంటల వేళ, తీరుబాటు కలుగ జేసుకొని, ఈ ఉత్తరాన్ని రాస్తున్న సమయంలో, మన చిన్న నాటి ఎన్నో సంఘటనలు నా కళ్ళముందు పొరాడుతున్నాయి.

ఒకసారి ఇంట్లో రూపాయి దొంగిలించి, ఎనిమిది మైళ్లు నడిచి మనం సినిమా చూసి వచ్చాం. నీ కా సంఘటన జ్ఞాపక ముండే ఉంటుంది. అంతకు ముందు మనం పట్టణాన్ని గురించి వినడమే గానీ, ఎన్నడూ చూడలేదు. తొలిసారిగా మనం గుంటూరును చూసినప్పుడు, మనం దాదాపు మూర్ఛ పోయ్యాం. అక్కడి ప్రజలు అనుభవిస్తున్న సుఖ సౌఖ్యాలను చూచి, అసూయ పడ్డాము గూడా. దిక్కూ దివాణమూ లేని, మన పల్లెటూరుతో పోల్చి చూసుకొని, ఇది భూలోక స్వర్గమే నని మనం తేల్చాం. ఆ తరువాత మనం ఆ గుంటూరులోనే ఆరేళ్ళుండి చదివాము. కానీ మన ఆనాటి దృష్టిలో, చెప్పుకో దగినంత మార్పేమీ రాలేదు.

మనిషికి ప్రధానంగా కావలసింది డబ్బు కాదనీ, అంతకు మించిన విలువలు చాలా ఉన్నాయనీ నేనొకప్పుడు అనుకొనే వాణ్ని. అందుకు కారణం లేకపోలేదు. బాధ్యతా రహితమైన విద్యార్థి జీవితం నాకా అభిప్రాయాన్ని కలుగ జేసింది. ఇంటి దగ్గర తల్లి దండ్రులు ఏ బాధల ననుభవిస్తు న్నారో మన కనవసరం. వా రెలా డబ్బు మనకు పంపు తున్నారో ఒక్కసారి గూడా మనం తీవ్రంగా ఆలోచించిన

పాపాన పోలేదు. కాని వాస్తవంగా, జీవితంలోకి అడుగు పెట్టిన తరువాత, నా అభిప్రాయాలు మారజొచ్చాయి. ఈ నాటి ప్రపంచంలో డబ్బుకున్న విలువ మరిదేనికీ లేదు. మన చరిత్రంతా, దానిచుట్టూ ప్రచండమైన వేగంతో పరిభ్రమిస్తున్నది.

అయితే ఇది సర్వ జనామోదమైన సత్యం కాదని నాకు తెలుసు. అయినా ఏది సర్వ జనామోదాన్ని పొందింది గనుక? భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని ఒక చెంప మహోద్యమం సాగుతుంటే, వద్దన్న వారు చాలా మంది ఉన్నారు. కనుక సర్వ జనామోద మన్న దాంట్లో బొత్తిగా అర్థం లేదను కొంటాను.

నేను మహా యోగులను గురించీ, మానవోత్తములను గురించీ రాయడం లేదు. కొందరు మానవ జీవులకు డబ్బు తుచ్ఛమైనదేమోగానీ, నే నలా భావించడం లేదు. డబ్బుకున్న ప్రచండమైన శక్తి తెలుసుకోవాలంటే, ఈ మద్రాసు ఒక పెద్ద ఉదాహరణ...

నిజమే! నీలాగా నేను గూడా, ఈ నగరాన్ని చూసి నప్పుడు కదిలి పోయాను. విశాలమైన రోడ్లు, అందమైన భవనాలు, లక్షల విలువ చేసే షాపులు, ఎన్నో రకాల హోటళ్ళు, కళ్ళను మెరిపించే కార్లు, అందులో అప్సరసల్లా, కిలకిలా నవ్వుతూ, పోయే అమ్మాయిలు,...ఎంత బావుంటుందని! నిజంగా ఇక్కడ ఏ కొరతా లేదు. ఏ వేళప్పుడు ఏ వస్తువు

కావాలన్నా దొరుకుతుంది. ఏ సుఖం అనుభవించాలన్నా, నీకు అందుబాటులో ఉంటుంది. అన్నిటినీ మించి, ఆంధ్ర దేశాన్ని భగ్గుమనిపించే ఎండలు ఇక్కడ లేనే లేవు. సాయంత్రం వేళ, అలా ఏ మెరీనా బీచికో వెడితే, ఎన్ని వందల కార్లు బారులు తీర్చి వుంటాయో నేను రాస్తే నువ్వు నమ్మవు. సముద్రం మీదినుంచి, ఉప్పెనగా వీచే ఆ చల్లని గాలిని, వంటినిండా పీల్చుకొని, ఇసుకలో జారగిలబడి, ఒడ్డును తాకి ఘోరుమని వచ్చే సముద్ర తరంగాలను చూడడం, మంచి అనుభవం కాదని అనగల సాహసం నాకు లేదు.

కానీ, ఈ సుఖాలు, అనుభవాలు, ఆనందాలు, అందరికీ అందుబాటులో లేవని నేనంటే, నన్ను నువ్వు క్షమించవలసి ఉంటుంది. ఈ మాట నీకు ఆశ్చర్యంగా తోచవచ్చు గూడా!

కానీ రామకృష్ణా!

ఇందులో ఆశ్చర్య పడవలసిం దేమీ లేదు. ఈ సత్యం మనకు అన్ని చోట్లా కనిపించుతూనే వుంటుంది. చిత్ర మేమిటంటే, మనమే దానిని చూడకుండా తప్పించుకొంటున్నాం.

ప్రొద్దు గూకూలూ రెక్కలు విరుచుకొంటేనే గాని కడుపు నిండని ఒక కూలీ, సాయంత్రం వేళ - సముద్రపు ఒడ్డుకు రాగలడేమో నువ్వు ఆలోచించు, ఆ సముద్రపు గాలి పీల్చి, ఆనందించే తీరికా, వ్యవధానమూ, ఆధునిక సాగరికత

అతని కివ్వడం లేదు. ఆ ఆనందాన్ని అనుభవించే టైంలో, అతను మరో అణా డబ్బులు కూలి సంపాదించు కొనవచ్చు. ఆ అణా కాసుతో అతని కుటుంబానికి, మరొక గరిటెడు గంజి (లేదా అన్నం) దొరకవచ్చు. అందుకే వాడు కూలి కోసం, తారట్లాడుతాడుగానీ - సముద్రపు షి కా రు కోసం పరవటిల్లడు.

ఇక్కడ ఉన్న వారంతా, ఇంతేనని నేను అనను. బ్రహ్మాండమైన మేడల దిగువ భాగాలు చూస్తే, నా గుండెలు కుతకుత లాడుతాయి. ఆ నీడలో ఎన్ని కుటుంబాలు! ఒక ప్రక్క మనిషికి అవసరమైన దాని కంటే ఎక్కువ డబ్బు వినియోగం లేకుండా పడి మురిగి పోతుంటే, మరొక వంక, ఒక్క కాని డబ్బు కోసం మరొకడు పడరాని పాట్లు పడుతున్నాడు. చేయరాని పనులు చేస్తున్నాడు...

బీదవారంతా ఉత్తములని నేను పొరబాటు పడను. ఒక రకంగా వీరిలోనే దుర్గుణాలు అధికమని గూడా నేను అంగీకరిస్తాను. కానీ అందుకు కారణం నువ్వూ, నేనూ, లేదా మనలాంటి వాళ్ళే నని నా నమ్మకం. ఇందుకు నువ్వు ఒప్పుకోక పోవచ్చు; కానీ ఇది సత్యమని మాత్రం నేను చెప్పగలను. ఒక వ్యక్తి దొంగతనం చేయవలసిన వాతావరణమంతా సృష్టించి, అతను దొంగిలించాడనడం ఏం న్యాయం? ఒక స్త్రీ వ్యభిచరించి తప్ప, జీవనం గడవని పరిస్థితులు కలిగించి, మనమే ఆ స్త్రీని వెక్కిరించడం ఏం ధర్మం?

ధనార్జన కోసం నేటి మానవుడు పడే పాట్లను చూసి, మానవ జాతిమీద నాకు కోపమూ, జాలీ, అసహ్యమూ గూడా కలుగుతున్నది. నువ్వు చేస్తున్నది, బడి పంతులు పని. భావి భారత పౌరుల్ని తీర్చి దిద్దాలని గాదు; బోర్డు వారిచ్చే అరవై రూపాయల కోసం. అలాగే నేను, ఈ డాక్టరీ అఘోరిస్తున్నానంటే, రోగులకు సేవచేదామని గాదు. జీతం ఇవ్వక పోతే, నువ్వు పంతులు పని మానినట్లే, తగినంత ఆదాయం లేక పోతే ఈ వృత్తిని నేనూ మానేసి ఉందు నేమో ?

ఇష్టం ఉన్నా లేక పోయినా, మనందరం, ఒక గిరి చుట్టూ తిరుగు తున్నాం. ఆ కేంద్రం పేరు డబ్బు. దాన్ని మానవుడే సృష్టించాడు. కానీ ఈ నాడది మానవుణ్నే తనను బానిసగా చేసు కొన్నది...

మదరాసు నగరాన్ని గురించి నీకున్న అభిప్రాయా లతో నేను ఏకీభవించ లేను. ఈ న గ ర మే గాదు; దేన్ని చూసినా నాకు 'వేశ్య' జ్ఞప్తి కొస్తుంది. అంద చందాలతో గానీ, తెలివి తేటలతో గానీ, వేశ్యకు నిమిత్తం ఉండదట. ఆవిడకు డబ్బే ప్రధాన మట. దాని నిజానిజాలు నాకు తెలియవు, కానీ నగరానికి మాత్రం డబ్బున్న వాడే ప్రధానం. డబ్బు లేని వాణ్ని అది ఈషణ్మాత్రమూ లెక్క చెయ్యదు. వాడి ఉనికినే గుర్తించదు....

దాదాపు అయిదారు సంవత్సరాలు ఈ నగరంలో ఉన్న తరువాత, నా కేర్పడిన అభిప్రాయ మిది ... నువ్వు

రెండో ఉత్తరంలో రాసినట్టు, నేనేమీ సంపాదించ లేదు. వెనక వేసుకోనూ లేదు. ఆ అవకాశాలు నాకు లేక మాత్రం కాదు. కానీ ఆ పద్ధతులే నాకు రుచించలేదు. అందుకే నేనిలా ఉన్నాను...

గొప్ప గొప్ప వాళ్ళు నా దగ్గరకు రారు. వచ్చినా వారికి నేను మందివ్వలేను. వారి నుండి డబ్బు గుంజడం కోసం నేను అబద్ధాలు చెప్పలేను. నేను చెప్పే నిజాలు వారూ వినలేరు. అందుచేతే నేను నగరంలో ఉండ లేక పోయాను. ప్రస్తుతం ఊరిబైట, ఓ చిన్న పెంకుటింట్లో, నా చిన్న హాస్పిటల్‌తో ఉంటున్నాను. ఈ విషయం నీకు క్రిందటి ఉత్తరంలోనే రాసినట్టు జ్ఞాపకం !

ఈ ప్రాంతంలో ఎక్కువగా కూలినాలి జనం, అలగా జనం ఉంటున్నారు. అతి సన్నిహితంగా ఉండి (పనేమీ లేక పోవడంతో) వారిని పరిశీలించు తుంటే, మనస్సు చిరాకెత్తి పోతుంది. వారి జీవిత విధానం, హృదయమున్న ఏ మానవున్నయినా కుదిపి వేస్తుంది. అందుకే నాగరికులు వీరిని బైటికి తరిమారేమో ?

హృదయ విదారకమైన ఎన్నో దృశ్యాలు నా కళ్ళ ముందు జరిగాయి. ఇంకా జరుగు తున్నాయి. వీటన్నింటికీ ఫలితం, ఏప్పుడో ఒకప్పుడు ఈ సమాజం అనుభవించక తప్పదు. మహత్తరమైన బలంతో, దీక్షతో, ఈ శక్తి నిద్రలేచిన నాడు, జరగబోయే విలయం తలుచుకొంటే, శరీరం గగుర్పొడు

స్తోంది. తరతరాలుగా సాగిన మారణహోమానికి, ప్రతీకారం, ఈ క్షుద్ర మానవులు ఎప్పుడో ఒకప్పుడు తీర్చుకోక పోరు. ఇంకా వీరిని మోసగింప జూడటం, ఎక్కువ కాలం సాగ దను కొంటాను...

*　　　*　　　*

ప్రక్కగదిలో ఉన్న రోగికి మందిచ్చి ఇప్పుడే వచ్చాను. ఈ రోగి చరిత్రను, కావాలనే నీకు వ్రాస్తున్నాను. ఆధునిక సమాజ వ్యవస్థ మానవుణ్నెలా క్రమంగా హరించి వేస్తున్నదో తెలుసు కొందుకు ఈ రోగి ఒక మంచి ఉదాహరణ.

దాదాపు అయిదారు సంవత్సరాల క్రిందట, దక్షిణ ప్రాంతంనుండి ఈ కుటుంబం ఇక్కడికి వచ్చింది. అందరిలాగే, వీరు కూడా మదరాసు మీద మమకారంతో వచ్చారు. ఆ భార్యా భర్తలకు నలుగురు పిల్లలు, నలుగురూ చిన్నవాళ్ళు. మొగుడు కొంత కాలం ఏదో ఫ్యాక్టరీలో పని చేశాడట. తరువాత రిక్షాలు లాగాడు. ఇంకొంత కాలం 'కూలి' మోశాడు. భార్య నాలుగిళ్ళు, పనికి వప్పుకొన్నది. కానీ దీని వల్ల వారికి కడుపు నిండటం లేదు. ఎన్నోసార్లు పిల్లలకు పెట్టి, వాళ్లు పస్తులున్న సందర్భాలున్నాయి.

వారి కేకోరికా లేదు. పెద్ద పెద్ద కలలు కనడం లేదు. శక్తి వంచన లేకుండా పని చేయడానికి సిద్ధమే! వారికి కావలసిందల్లా కడుపునిండా తిండి, రవ్వంత నీడ. కానీ 'అందాల కాణాచి' వారి కామాత్రం ప్రసాదించ లేదు. ఈ సంగతు లన్నీ నాకు వారి ద్వారానే తెలిశాయి...

బ్రతకడం కోసం మానవుడెంత తీవ్రంగా పోరాడవలసి వస్తున్నదో నేను చూచాను. ఈ ఉత్తరం, నా అంతర్వేదనను శతాంశం గూడా వ్యక్త పరుస్తుం దనుకోను. ఏ భాషా దానిని సమగ్రంగా ప్రకటించ లేదు.

దాదాపు రెండు మూడు నెలల తర్వాత గానీ, నేనా కుటుంబాన్ని తిరిగి కలుసుకోనలేక పోయాను. వారిని చూసి మొదట నేను ఆశ్చర్య పోయాను. వారెప్పుడో తిరిగి, స్వగ్రామం వెళ్ళి ఉంటారను కొన్నాను. కానీ నా ఊహ సరికాదు. వారిక్కడ ఉండటమే గాదు; బ్రతకడం గూడా నేర్చుకొన్నారు. ఉదయమే, చిన్న పిల్లలను ఇంటి దగ్గర దిగవిడిచి, వారు టౌన్‌లోకి వెడతారు. వీధుల్లో పారేసిన చెత్త కాగితాల నన్నింటినీ పోగు చేసుకొస్తారు, వాటిని దుమ్ము, దూగర లేకుండా బాగుచేస్తారు. ఆ రోజల్లా నానవేసి, తెల్ల వారి పిండి లాగా రుబ్బుతారు. ఆ కాగితం గుజ్జుతో, ఏవో బొమ్మలు చేస్తారు. వాటికి రంగు లద్దుతారు. సాయంత్రం వేళ, ఏ చైనాబజారులోనో నిలబడి అమ్ముతారు. ఆ వచ్చిన దానితో గంజి కాచుకొని బ్రతుకు తున్నారు. క్రమంగా ఈ వృత్తిలోకి పెద్ద పిల్లలిద్దరూ ప్రవేశ పెట్టబడ్డారు. వాళ్ళిద్దరూ ఉదయమే ఇంత గంజి తాగి ఊరుమీద పడేవారు. మధ్యాహ్నానికి, రెండు మూటల తుక్కు కాగితాలతో ఆపురావురుమంటూ గుడిసె కొచ్చేవారు. ప్రతిరోజూ పదెనిమిది మైళ్ళు తిరిగి తేనే గానీ, అన్ని కాగితాలు పోగుపడవు. సరిగ్గా పదేళ్ల

నిండని ఆ పసికూనలు, అలా గోనె సంచులు భుజాలకు తగి లించుకొని, వీధులంట తిరగడం ఎంత దారుణం? చీకూ చింతా లేకుండా, ఉండవలసిన ఆ యీడులో, వారి కప్పుడే బ్రతుకు సమస్య ఏర్పడటం ఎంత ఘోరం? తమ ఈడే గల తోటి పిల్లలు, రంగురంగుల దుస్తుల్లో, చక్కగా ముస్తాబయి, చదువు కొందుకు పోయే దృశ్యాన్ని చూసి, ఆ లేత హృద యాలు ఎంత తొక్కిస మిక్కిస లాడాయో ఎవరు చెబుతారు? అప్పుడు వారిలో రేగిన భావాలకు రూప కల్పన చేయడం సాధ్యమేనా ?

వారికి పుష్కలంగా సహాయ పడలేని, నా అసమర్థ తను తలుచుకొని కుమిలి పోయాను.

ఇలా కొన్ని రోజులు గడిచాయి.

ఒక నాటి రాత్రి మా ఇంటి తలుపుల నెవరో బాదు తున్నారు. నేను వెళ్ళి తలుపు తీశాను. ఓ పాతిక మంది మను ష్యులు గగ్గోలుగా మా ఇంట్లో ప్రవేశించారు. ఒకటి రెండు క్షణాలు నేను కలవర పడి పోయాను. ఏది ఏమిటో నా కర్థం గాలేదు. వారి వెనుకనే కొందరు 'రోగులు' గూడా ప్రవేశ పెట్టబడ్డారు. వారిని చూశాను; నా నవనాడులూ కుంగి పొయ్యాయి. రక్తం ఈడ్చుకు పోయినట్లు విలవిల లాడాను. వారి శరీరాలు నల్లగా మాడిపొయ్యాయి. మాంసం కాలిన వాసన ఆ గది నంతా ఆక్రమించింది—

జరిగిన సంగతిది :

రోజులాగే, ఆ రోజునా, ఆ కుటుంబీకులు పడుకొన్నారు. వారి గుడిసె ప్రక్కనే, పిల్లలు తెచ్చిన తుక్కు కాగితాలు రాసిలా పడి వున్నాయి. దురదృష్టవశాత్తూ అగ్నిప్రమాదం జరిగింది. ఆ గుడిసె, దాని పక్కనున్న కాగితపు గుట్ట భగ్గుమని అంటుకున్నాయి. ఇరుగు పొరుగుల సహాయం అందే లోగానే, వారంతా ఆ మంటల్లో దారుణంగా కాలిపోయారు.

అయినా శక్తి వంచన లేకుండా నేను కృషి చేశాను. పిల్లలు ఎప్పుడో చచ్చిపోయారు. మగవాడు మాత్రం రెండు రోజులు భయంకరంగా బాధపడి నా ఎదుటనే మరణించాడు. అతన్ని బ్రతికించడం కోసం, నేను నా యావచ్ఛక్తినీ వినియోగించాను. ఎంతో ఖరీదుగల మందులు వాడాను. నల్లభై వినిమిది గంటల సేపు, మృత్యువుతో బాహాబాహీ పోరాడాను. కొసకు మృత్యుదేవత గెలిచింది. నేను పరాజితుణ్నయినాను.

రామకృష్ణా!

భగవంతుని మీద నాకు నమ్మకం లేదు. జగద్రక్షకుడనేవాడుంటే, ప్రపంచంలో ఇన్ని అన్యాయాలు, అక్రమాలు, అమానుష చర్యలు జరుగుతూ ఉంటే చూస్తూ ఊరుకోడు. మానవులమైన మనమే (అందరూ కాదు) సహించలేని ఎన్నో దారుణ కృత్యాలను, ఆ కరుణామయుడు సహించాడంటేనే, అతని వ్యక్తిత్వం మీద నాకు అసహ్యం వేస్తు

న్నది. కానీ, ఆ సమయాన నేనా భగవంతుణ్ని గూడా, ఆత్మ సాక్షిగా ప్రార్థించాను. కానీ లాభం లేకపోయింది...

నాకిప్పు డే మనిపిస్తున్నదంటే, అతనలా చచ్చి పోవ డమే మంచిదని, నన్ను అపార్థం చేసుకోకు; బ్రతికి ఉండి అతను అనుభవించిందేమీ లేదు. ఇక ముందు అనుభవించ బోయేదీ లేదు. దురదృష్ట వశాత్తూ అతను జీవించినా, మరిన్ని కష్టాలకు గురవడమేగానీ, లాభ మేమిటి? నలుగురు బిడ్డలు ఒక్కక్షణంలో, మసిబొగ్గుల్లా మాడిపోయిన ఆదారుణ సంఘ టనకు, అతను మనస్థిమితం కోలుపోడా? భయంకరంగా కాళ్ళు చేతులు కాలిపోయిన అతను జీవించేదెలా? కాబట్టి అతను చనిపోవడమే మంచి దను కొన్నాను.

కానీ – అంతకు మించిన మరో విషమ సమస్య నన్ను చుట్టుకొన్నది. అతని భార్య గూడా ఘోరంగానే కాలి పోయింది. ఆమెకూ నేనే చికిత్స చేశాను. ఆమె కోలుకొంది. తొలి విజయం మృత్యువు సాధించినా, మలి విజయం నేను పొందాను. ఆమెను బ్రతికించాను.

నేను చేసిన ఈ పని మంచి చెడ్డలను గురించి, గంటల కొద్దీ నేను ఆలోచించాను. ఆమెను బ్రతికించి, నేను మహా పాపానికి ఒడిగట్టానన్న నిర్ణయానికి వచ్చాను. ఈమె శరీరం గూడా బాగా కాలి పోయింది. కళ్లు పేలి పొయ్యాయి. కుడి చేయి, సగం వరకూ పనికిరాదు. ముఖమంతా మాడి పోయింది. ఈమెను బ్రతికించి, నేను బాధ్యత వదిలించు

కోవచ్చు. కానీ, ఆ మైని? ఆమె ఎలా జీవించాలి? కళ్ళు లేవు, కాళ్ళు లేవు, చేయి లేదు. ఏపనీ చెయ్యలేదు గదా? ఎక్కడకూ వెళ్ళలేదు గదా, ఎలా జీవించాలి? ఈ ప్రశ్న భయంకరంగా నాకు గోచరిస్తున్నది. కలకాలం పోషించడానికి నేను అసమర్థుణ్ని. నన్ను నేనే పోషించుకోలేని ఈ దుస్థితిలో ఆమె నెలా పోషించను? అందులోనూ మామూలు రోగి కాదు. అన్ని అవసరాలూ ఒక్కచోటనే తీరవలసిన స్థితిలో ఉన్నది. మరొక రెవరో పోషించగలరని, ఆత్మవంచన చేసుకో లేను. నారు పోసినవాడు నీరు గూడా పోస్తాడన్న అధమ తరగతి వేదాంతం నేను నమ్మను.

ఈ సమస్యలన్నీ పరిష్కరించ బడాలంటే ఒక్కటే మార్గం. ఆమె చనిపోవాలి. దానితో అన్ని చిక్కులూ ఇట్టే విడిపోతాయి. ఆమె చనిపోవడమో, జీవించడమో నామీద ఆధారపడి ఉన్నది. ఒక చిన్న డోసుతో, ఆమె ప్రాణం ఎగిరి పోతుంది. ఒక రకంగా అది ఆమెకు సుఖం గూడా కదా?

వెంటనే నేనీ నిర్ణయానిక వచ్చాను. అట్టే బాధ పెట్ట కుండా, చప్పున వ్యవహారం తేల్చివేసే మందు, అందుబాటులో ఉన్నది. చాలు! చిన్నడోసుతో ఆమె సకలకష్టాలు గట్టెక్కు తాయి. బ్రహ్మాండమైన ఒక సమస్య, సులభంగా పరిష్కరింప బడుతుంది. ఈ విషయం మరొకరికి తెలియను గూడా తెలి యదు. ప్రభుత్వం గూడా నన్ను అనుమానించదు.

ఈ పని అన్ని విధాలా నాకు శ్రేయస్కర మని

పించింది. కానీ ఆచరణలో పెట్టబోయేసరికి, అంతరాత్మ ఎదురు తిరిగింది. నేను చేయనున్న ఈ పని, నీచాతి నీచమైన దని, అది నన్ను హెచ్చరించింది. వైద్యుడుగా ఈ పని చేయడం ఎంత నీచమో ఆలోచించ మన్నది.

నిజమే!

డాక్టరుగా నాకూ కొన్ని బాధ్యత లున్నాయి. వాటిని నేను సక్రమంగా నిర్వహించాలి. ప్రాణం ఉన్నంత వరకూ, నేను రోగిని బ్రతికించడానికే ప్రయత్నించాలి. అందు కోసం శక్తి వంచనలేకుండా నేను పాటుబడాలి. ఆ విధంగా చేస్తానని నేను ప్రమాణం గూడా చేశాను. నాకు, రోగి తాలూకు ఇతర వ్యవహారాలతో ఎంత మాత్రం సంబంధం లేదు. అతను మహారాజైనా, బిచ్చగాడైనా డాక్టరునైన నాకొక్కటే! రోగిని రోగంనుండి విముక్తి చెయ్యాలి, బ్రతికించాలి. అదీ నా డ్యూటీ?

కానీ, నేను అందుకు భిన్నంగా ప్రవర్తించు తున్నాను. అంటే నా బాధ్యతనుండి నేను తప్పిపోయా నన్నమాట. చేజేతులా ఒక ప్రాణిని చంపానన్న మాట. హంతకునికి విధించే శిక్ష నాకూ విధించ వచ్చునన్నమాట. ఏం? ఎందుకు కాదు? ఒకడు కత్తితోనో, తుపాకి తోనో చంపితే, నేను సైన్సు ప్రసాదించిన 'మందు'తో చంపుతున్నాను. విధానం వేరు కావచ్చు; కానీ గమ్యం ఒక్కటే గదా?

ఎన్నో వందల మందికి ప్రాణదానం చేసిన చేతులతో, ఒక ప్రాణిని చంపలేక పోయాను. తిరిగి కుర్చీలో కూల బడ్డాను. ఆలోచనలు అనంతంగా రేగుతున్నాయి. ఆమెను బ్రతికించాలన్న నిశ్చయానికే వచ్చాను.

మంచిదే! బ్రతికించవచ్చు, కానీ ఆ తరువాత సంగతేమిటి? డాక్టరుగా నా బాధ్యత తీరితే తీరవచ్చు. అయితే మానవుడుగా నేను చేయవలసిన పని ఇంకా చాలా ఉంది. ఆ పని నేను ఎటుగూడి నిర్వహించలేను. ప్రాణాలతో ఆమెను వీధిలో వదిలి, భయంకరమైన, భావికష్టాలను అనుభవించ మనడం మానవత్వ మనిపించు కొంటుందా? రానున్న ఆ దారుణ వేదనామయ జీవితానికి, కారణ భూతుణ్ని నేనే అవుతాను. తోడిప్రాణిని సుఖ పెట్టడానికి ప్రయత్నించడం పోయి, కల కాలం నరకయాతన పడమనడం, ధర్మ మనిపించు కోదు.

ఈ సమయంలో నేనేమి చేయాలి? నా కర్తవ్య మేమిటి? ఇతర సమస్యల నేవీ ఆలోచించకుండా, డాక్టరుగా నా కర్తవ్యాన్ని నిర్వహించడమా? లేక మానవత్వ దృష్టితో, ఆమె నా కష్టాలపాలు గాకుండా తప్పించడమా?

రామకృష్ణా!

నేనీ జటిల సమస్యతో వేగిపోతున్నాను. అందుకే నీకు ప్రత్యుత్తరం రాయలేదు. అవతల ఆమె మూలుగు తున్నది. నేను వెడుతున్నాను. నా కర్తవ్యాన్ని స్పష్టపరుస్తూ వెంటనే

జవాబురాయి. నీ ఉత్తరం కోసం నేను ఎదురు చూస్తుంటాను.

ఉంటాను,

భవదీయ

మూర్తి.